

జిల్లా ఆస్పత్రికి త్వరలో ఐసీయూ
ఆకస్మిక తనిఖీలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి 5
డీసీసీ అధ్యక్ష పీఠానికి పోటాపోటీ
తాండూరు నుంచే ఐదుగురి దరఖాస్తు
ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేరు ప్రతిపాదన 4



సీపీఆర్ చేస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సీపీఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకుంటే ఆకస్మిక గుండెపోటుకు గురైన వారిని ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకస్మాత్తుగా గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చూస్తున్నామని, అలాంటి వారికి సీపీఆర్ చేసి ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి బయట పడుతారన్నారు. జిల్లాలో సీపీఆర్‌పై అవగాహన కల్పించి కార్డియాక్ హెల్త్‌కేర్ వ్యవస్థను పటిష్ఠ పరిచేందుకు ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లోనూ సీపీఆర్‌పై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీపీఆర్ ఎలా చేయాలనేది మాస్టర్ ట్రైనర్స్ నిఖిల్, నిరోషా ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ సీపీఆర్ చేసి చూపించారు. అనంతరం సీపీఆర్ ఆవశ్యకతపై వివిధ శాఖల జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్వో మంగీలాల్, డీఎంహెచ్‌వో డాక్టర్ పవిత్ర, డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్ యాదవ్, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం


వికారాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులతో పాటు గతంలో దరఖాస్తు చేసిన విద్యార్థులు, ఆసక్తి ఉన్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈనెల 18న సాయంత్రం 5 గంటలలోగా వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కొత్తగడి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో దరఖాస్తులు అందించాలని కోరారు. దరఖాస్తు వెంట కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు ప్రవేశపరీక్ష రాసిన విద్యార్థులు హాల్ టికెట్, ర్యాంకు ధ్రువీకరణ పత్రం జత పరచాలని సూచించారు.

పాత విధానంలో రిజర్వేషన్లు అమలు చేస్తే..

వికారాబాద్ జిల్లా

స్థానాలు	మొత్తం	బీసీ రిజర్వ్‌డ్ (సుమారు)
జెడ్పీటీసీలు	20	4
ఎంపీపీలు	20	4
ఎంపీటీసీలు	227	48
సర్పంచ్‌లు	594	125
వార్డులు	5,058	1,062

బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులోనూ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల కథ మళ్లీ మొదటికి వచ్చింది. పాత విధానంలో రిజర్వేషన్లు 50శాతానికి మించకుండా ఎన్నికలు జరుపుకోవచ్చని సుప్రీం సూచించడంతో ఆశావహులతో పాటు అధికారులూ డీలా పడ్డారు. నామినేషన్లకు సిద్ధమైన ఆశావహులు.. ఇప్పుడిచ్చిన రిజర్వేషన్లు తారుమారైతే తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటని ఆందోళన చెందుతున్నారు. కాగా, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత హైకోర్టు స్టే ఇచ్చిన సంగతి తెలిసిందే.



మళ్లీ మొదటికి..

'సుప్రీం' తీర్పుతో అందరిలోనూ నిరాశ



బీసీ రిజర్వేషన్లపై సర్కార్‌కు ఎదురుదెబ్బ
ఆశావహులతో పాటు అధికారులూ డీలా
రిజర్వేషన్ల తారుమారుపై నేతల ఆందోళన
స్థానిక సంస్థల ఎన్నికలపై నీలినీడలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నీలినీడలు అలుముకున్నాయి. సుప్రీంకోర్టు తీర్పు అనుకూలంగా వస్తుందని ఎదురుచూసిన ప్రభుత్వానికి చుక్కెదురైంది. దీంతో ప్రభుత్వం మళ్లీ పాత విధానంలోనే స్థానిక ఎన్నికలు నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా సుప్రీం కోర్టు తీర్పుతో ఆశావహులతో పాటు అధికారులు సైతం డీలాపడ్డారు. సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా పాత విధానంలో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తే అధికారులు మళ్లీ కొత్తగా ఎన్నికల కసరత్తు మొదలు పెట్టాల్సి ఉంటుంది. దీనికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది. ఇప్పటికే కొన్ని నెలలుగా స్థానిక కసరత్తు చేసిన అధికారులు మళ్లీ రిజర్వేషన్ల ప్రక్రియతో పాటు మిగతా ఎన్నికల నిర్వహణపై కసరత్తు మొదలు పెట్టాల్సి ఉంటుంది.

రిజర్వేషన్లు తారుమారు..

మరో వైపు రిజర్వేషన్లు ఖరారు చేయడంతో దాదాపు అన్నిచోట్ల ఆశావహులు ఎన్నికల్లో నామినేషన్లకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఎన్నికల వ్యూహాల్లో భాగంగా కొందరు ఇప్పటికే భారీగా ఖర్చు చేశారు. విందులు, వినోదాల

మిగతా 5వ పేజీలో...

కొడంగల్ బంద్ సంపూర్ణం

» విద్యా సంస్థలను తరలించొద్దు
» జేఏసీ ఆధ్వర్యంలో బంద్, నిరసన



మాట్లాడుతున్న జేఏసీ, వివిధ పార్టీల నాయకులు

కొడంగల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రాంతానికి మంజూరు చేసిన విద్యా సంస్థలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు అన్నారు. మెడికల్, వెటర్నరీ కళాశాలలు, పాత కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని గురువారం కొడంగల్ బంద్‌కు పిలుపునిచ్చారు. జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్‌కు వ్యాపారస్తులు, ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లి శివారులో మెడికల్, వెటర్నరీ కళాశాలల నిర్మాణానికి భూ సేకరణ చేపట్టి ఇతర ప్రాంతాలకు తరలించడం సరైంది కాదన్నారు. పాత కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఏర్పాటు చేయకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం తగదన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో వినాయక చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఈ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని భావించిన ప్రజలు విద్యాసంస్థల తరలింపుతో నిరాశకు గురవుతున్నారన్నారు. విద్యాసంస్థల తరలింపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. కొన్ని రోజులుగా మెడికల్, వెటర్నరీ కళాశాలలు, ఇంటిగ్రేటెడ్ గురుకులాల తరలింపు సరైంది కాదని నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ లక్ష్మీనారాయణ గుప్తా, కో కన్వీనర్లు శ్రీనివాస్, సురేశ్, రమేశ్‌బాబు, శాంతకుమార్, బుస్స చంద్రయ్య, నవాజ్, వెంకటయ్య, అనిల్, ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు దామోదర్‌రెడ్డి, మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న దరఖాస్తులు

వైన్ షాపులకు గడువు రేపటితో ఆఖరు
ఇతర రాష్ట్రాల వ్యాపారుల ఆసక్తి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

మేడ్చల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మద్యం షాపుల దరఖాస్తుల స్వీకరణకు సమయం దగ్గర పడుతుండటంతో దరఖాస్తులు ఊపందుకున్నాయి. జిల్లాలో 15వ తేదీ వరకు 1,010 దరఖాస్తులు రాగా గురువారం ఒక్కరోజే 500కు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మద్యం దుకాణాల కోసం ఇతర రాష్ట్రాల వ్యాపారులు సైతం ఆసక్తి చూపుతుండటం గమనార్హం. దరఖాస్తుల స్వీకరణకు ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. జిల్లాలో మేడ్చల్, మల్కాజిగిరి రెండు ఎక్సైజ్ డివిజన్లు ఉండగా గురువారం సాయంత్రం వరకు 3,150 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. గతనెల 26 నుంచి మద్యం టెండర్ల కోసం అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తుండగా రేపటితో గడువు ముగుస్తుండడంతో మద్యం వ్యాపారుల నుంచి దరఖాస్తులు ఊపందుకున్నాయి. ఈసారి ఒక్కో దుకాణానికి దరఖాస్తు ఫీజును ప్రభుత్వం రూ.3 లక్షలకు పెంచింది. ఈ నెల 23న కొత్త మద్యం దుకాణాలకు లాటరీ తీయాల్సి ఉంది. గడువు దగ్గర పడుతుండటంతో ఎక్సైజ్ అధికారులు మద్యం వ్యాపారులకు ఫోన్ చేసి దరఖాస్తులు వేయిస్తున్నారు. ఈ రోజు, రేపు పెద్ద ఎత్తున దరఖాస్తులు రావచ్చని అధికారులు ఆశిస్తున్నారు.

పశువుల్లో గాలికుంటు నివారణకు టీకాలు

తాండూరు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువులకు గాలికుంట వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా పశువైద్యాధికారి సదానందం అన్నారు. గురువారం తాండూరు పట్టణంలోని గోశాలలో గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తాండూరు పశువైద్య ఆస్పత్రిలో విలేకరుతో మాట్లాడుతూ జిల్లాలో లక్షా 95వేల పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు వికారాబాద్ జిల్లాలోని 20 మండలాలు, 524 గ్రామ పంచాయతీల్లో 200 మంది సిబ్బందితో 53 టీమ్‌లు ఏర్పాటు చేసి గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివదుర్గాప్రసాద్, తదితరులు ఉన్నారు. అనంతరం తాండూరులో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బందోబస్తు మధ్య ప్రారంభోత్సవం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రారంభించిన రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ
రద్దయిన మంత్రి పొంగులేటి పర్యటన
కాంగ్రెస్ నాయకులు మధ్య వివాదాలే కారణం!



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాజీవ్‌గాంధీ హనుమంతు

శామీర్‌పేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో శామీర్‌పేట దర్గా సమీపంలో నిర్మించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాన్ని గురువారం పోలీసు బందోబస్తు మధ్య రాష్ట్ర స్టాంపుల, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్, కమిషనర్(ఐజీ) రాజీవ్‌గాంధీ హనుమంతు ప్రారంభించారు. అయితే ఈ భవనం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాల్సి ఉండగా కాంగ్రెస్ నాయకుల మధ్య వివాదాల కారణంగా మంత్రి తన పర్యటనను రద్దు చేసుకున్నారు. అధికారులు ఈ కార్యక్రమానికి రాజకీయ నాయకులను, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించలేదు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ జాయింట్ ఐటీ మధుసూదన్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ అశోక్, ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, శామీర్‌పేట సబ్ రిజిస్ట్రార్ అనిల్‌కుమార్, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్తలో కేసు వేస్తా..

శామీర్‌పేటలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మేడ్చల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఖాళీగా ఉన్న శామీర్‌పేట ఎంపీడీఓ భవనంలోకి శామీర్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించి

మిగతా 8వ పేజీలో...

కొడంగల్‌కు వ్యవసాయ కళాశాల

గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రాష్ట్ర మంత్రివర్గం



వికారాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమమైంది. రాష్ట్రంలో కొత్తగా మూడు వ్యవసాయ కళాశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా, వాటిలో ఒక కళాశాలను కొడంగల్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధ్యయనం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు జిల్లాలో కొడంగల్ నియోజకవర్గం అనువైన ప్రాంతంగా గుర్తించి నివేదిక అందించారు. కొడంగల్ నియోజకవర్గంలో జాతీయ రహదారి పక్కన వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. కళాశాల ఏర్పాటు చేసేందుకు 75 నుంచి 100 ఎకరాల వరకు స్థలం అవసరం కాగా, కళాశాల భవనాల నిర్మాణానికి రూ.120 కోట్ల వరకు ఖర్చు కానుంది. 100 మంది వరకు బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాల్సి ఉంటుంది. ఐకార్ అనుమతులు తీసుకుని ఈ విద్యా సంవత్సరంలోనే వ్యవసాయ కళాశాలలో తరగతులు ప్రారంభించేందుకు విశ్వవిద్యాలయం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది బీఎస్సీ కోర్సులో 60 మందికి ప్రవేశాలు కల్పించనున్నారు. తాత్కాలిక భవనాల్లో మౌలిక వసతులు కల్పించి తరగతులు ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

సమస్యల పరిష్కారంపై నిరంతర పోరాటం

ఘట్‌కేసర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యల పరిష్కారానికి సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. గురువారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ యాదాద్రి పార్కులో జరిగిన సీఐటీయూ మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు రూ.18,500 వేతనం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం 20 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అశోక్, రవి, యాదయ్య, సబిత, చంద్రమౌళి, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విత్తన పంపిణీలో గోల్‌మాల్!



మొత్కూరు గేటు సమీపంలో బోల్తాపడిన వేరుశనగ విత్తనాల డీసీఎం

పక్కదారి పట్టిన సబ్సిడీ వేరుశనగ విత్తనాలు
బస్తాలు మార్చి బయటి మార్కెట్‌లో విక్రయాలు
సొమ్ము చేసుకుంటున్న అధికారులు, నాయకులు

అధికారులు, అధికార పార్టీ నేతల కుమ్మక్కు

పరిగి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులకు వందశాతం రాయితీపై సరఫరా చేస్తున్న వేరుశనగ విత్తనాలు పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. అధికారులు, అధికార పార్టీ నేతలు కుమ్మక్కై, రాయితీ విత్తనాల పంపిణీలో గోల్‌మాల్ చేసినట్లు సమాచారం. రైతులకు అందాల్సిన విత్తన బస్తాలను మార్చి మార్కెట్‌కు మళ్లించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులు వేరుశనగను సెప్టెంబర్‌లోపే విత్తుతారు. ప్రభుత్వం అదును దాటిన తర్వాత జిల్లాకు పంపిణీ చేయడంతో రైతులకు అందాల్సిన విత్తనాలు రాత్రిపూట తరలించడం అనుమానాలకు తావిస్తోంది.

2,025 క్వింటాళ్ల ఉచిత విత్తనాలు

జాతీయ నూనె గింజల అభివృద్ధి మిషన్ ఆధ్వర్యంలో వందశాతం రాయితీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నారు. ఇందులో రెండు రకాలుగా అంటే వీసీసీ పథకం ద్వారా వందశాతం రాయితీ, బీఎల్‌డీ పథకం ద్వారా 50 శాతం రాయితీపై విత్తనాలను పంపిణీ చేస్తారు. ప్రభుత్వం జిల్లాకు వందశాతం రాయితీపై 2,025 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు, 50 శాతం రాయితీపై 1,012 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను కేటాయించింది. ఈ విత్తనాలను జిల్లాలోని బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల్, కొడంగల్, దోమ, కులకచర్ల, బషీరాబాద్, యాలాల్ మండలాల్లోని పలు గ్రామాల్లో 20 కిలోల చొప్పున ఉన్న 15,185 బస్తాలను రాయితీపై పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 15,110 ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తారని అంచనా వేయగా, 20 వేల ఎకరాలకుపైగా

మిగతా 6వ పేజీలో...



గోదాంలో ఉచిత వేరుశనగ విత్తనాల బస్తాలు

వేరుశనగ విత్తనాలకు ఫుల్ డిమాండ్

వేరుశనగ విత్తనాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. బహిరంగ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.11,000 నుంచి రూ.12,500 వరకు పలికింది. రైతులు సెప్టెంబరు మొదటి వారంలోనే మహబూబ్‌నగర్, బిజినేపల్లి, జడ్చర్ల లాంటి మార్కెట్లలో విత్తనాలు కొనుగోలు చేసి ఇప్పటికే విత్తుకున్నారు. ఏటా అదును దాటిన తర్వాతే ఉచిత విత్తన పంపిణీ పరిపాటిగా మారింది. ఎంపిక చేసిన గ్రామాల్లో ఉచితంగా విత్తనాలు పంపిణీ చేసినా అప్పటికే రైతులు విత్తనాలు నాటుకున్నారు. ఉచితంగా ఇస్తున్నారు కదా అని తీసుకుందామని వెళ్తే లేవంటున్నారని చెబుతున్నారు.

బతిమిలాడితే 60 కిలోలిచ్చారు



50 శాతం రాయితీ విత్తనాలను రూ.6,400కు క్వింటా చొప్పున కొన్నా. అవి విత్తినా మొలకలు సరిగ్గా రాలేదు. ఉచిత విత్తనాలు కావాలని బతిమిలాడితే 60 కిలోలు ఇచ్చారు. ప్రభుత్వం అందించే ఉచిత విత్తనాలు రైతులకు అందడం లేదు. పలుకుబడి ఉన్నావారికే దక్కుతున్నాయి.

- రసూల్‌ఖాన్, రైతు, గోకపసల్‌వాద్, దౌల్తాబాద్

డీసీసీ అధ్యక్ష పీఠానికి పోటాపోటీ

● ఒక్క తాండూరు నుంచి ఐదుగురి దరఖాస్తు
● ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేరునూ ప్రతిపాదించిన ముఖ్య కార్యకర్తలు
● అధ్యక్ష పీఠంపై పలువురి ఆసక్తి


అధ్యక్ష పదవికి దరఖాస్తు అందజేస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్

తాండూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం తాండూరు నుంచి అత్యధికులు పోటీ పడుతున్నారు. గురువారం యాలాల, బషీరాబాద్ మండలాలకు సంబంధించి వెంకోబా ఫంక్షన్ హాల్‌లో, తాండూరు టౌన్, తాండూరు మండలం, పెద్దేముల్ మండలానికి శ్రీ కన్వెన్షన్ హాల్లో సంస్థాగత నిర్మాణంపై సమావేశాలు నిర్వహించారు. ఏఐసీసీ తరుపున ఇంచార్జిగా వచ్చిన సూరజ్‌సింగ్‌ఠాకూర్, పీసీసీ నుంచి బెల్లయ్యనాయక్, రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ సభ్యులు ఎం.రమేష్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు పాల్గొన్నారు. సూరజ్ సింగ్‌ఠాకూర్ మండలాల వారీగా ముఖ్య కార్యకర్తల అభిప్రాయలను స్వీకరించారు. డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తులను స్వీకరించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్వతహాగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆశించకున్నా ఆయన పేరును మెజారిటీ కార్యకర్తలు సూరజ్‌సింగ్‌కు బలపర్చారు. ఇదిలా ఉంటే జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి వికారాబాద్ నుంచి సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, రఘువీరారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తనయుడు రిత్విక్‌రెడ్డి, లాల్‌కృష్ణప్రసాద్ పోటీ పడుతూ దరఖాస్తులు ఇచ్చారు. తాండూరు నుంచి మాత్రం ఐదుగురు జిల్లా అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రస్థాయి పదవుల్లో ఉన్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, కల్వ సుజాత దరఖాస్తు చేయగా, పార్టీ సీనియర్లు ఉత్తంచంద్, జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శోభారాణి, బషీరాబాద్ మండలానికి చెందిన శంకరయ్య దరఖాస్తులు అందజేశారు. దరఖాస్తులను ఏఐసీసీ పరిశీలించిన తర్వాత అధ్యక్షుల పేరును ఖరారు చేస్తారని ప్రస్తుత డీసీసీ చీఫ్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూరజ్‌సింగ్‌ఠాకూర్ ఈ సూచించారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


సైకిళ్లు పంపిణీ చేస్తున్న మైక్రోసాఫ్ట్, యునైటెడ్ వే హైదరాబాద్ సభ్యులు

నందిగామ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నందిగామ మండల పరిధిలోని మేకగూడ ప్రభుత్వ పాఠశాలలో చుట్టు పక్కల గ్రామాలు పిట్టలగూడ, సంఘిగూడ, చలివేంద్రగూడ నుంచి వచ్చి చదువుకునే 31 మంది విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ యునైటెడ్ వే హైదరాబాద్ సంస్థల ఆధ్వర్యంలో గురువారం సైకిళ్లను పంపిణీ చేశారు. అదే విధంగా పాఠశాలకు టీవీ, ల్యాప్‌ట్యాప్, స్పోర్ట్స్ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వర్, మైక్రోసాఫ్ట్ కమ్యూనిటీ అఫైర్స్ ప్రతినిధి చందన, యునైటెడ్ వే హైదరాబాద్ సభ్యులు అదితి, మహేశ్వరి, నాయకులు బండారి రాజు, ఆంజనేయులు, నరసింహ పాల్గొన్నారు.

రిజర్వేషన్లకు ఉద్యమించాలి

● వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్



వికారాబాద్,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 18న జరగనున్న రాష్ట్ర బంద్‌కు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు బీసీ మేధావుల ఫోరం నేత, వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు కె.శ్రీనివాస్ తెలిపారు. రాజకీయ పార్టీలన్నీ చిత్తశుద్ధితో బీసీల ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన ప్రజలకు ఫలాలు అందాలని, బడుగు బలహీన వర్గాల్లో బీసీలకు అన్యాయం జరుగుతోందని, బీసీలను కులాల పేరిట విడగొట్టి రాజకీ య పార్టీలన్నీ 75ఏళ్లుగా అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. బీసీల్లో చైతన్యం రావడంతో న్యాయస్థానాలను ఆశ్రయించి రిజర్వేషన్లు 50 శాతం మించకూడదనే సుప్రీం కోర్టు తీర్పును చూపుతూ 42శాతం బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లకు 50శాతం పరిమితి ఉంటే రాష్ట్రంలో 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రకటించిన 42శాతం రిజర్వేషన్లను సాధించుకునేంత వరకు ఎవరూ భేషజాలకు పోకుండా కులాలు, పార్టీలు, వర్గాలు అనే బేధం లేకుండా కలిసికట్టుగా పోరాడేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ బంద్ తర్వాత కార్యాచరణ తీసుకుని చట్టసభల్లో రిజర్వేషన్లు సాధించుకునేంత వరకు తెలంగాణ ఉద్యమం తరహాలో పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

అయోధ్యకు చేరుకున్న జానపద కళా బృందం

బొంరాస్‌పేట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహించే దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా తెలంగాణ జానపద కళా ప్రదర్శనల్లో పాల్గొనేందుకు గురువారం అక్కడికి చేరుకున్నట్లు కళాబృందం మాస్టర్ ఆర్.ప్రకాశ్ తెలిపారు. తెలంగాణ జానపద కళా ప్రదర్శన బోనాల ఉత్సవం ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ప్రదర్శనలు నిర్వహిస్తామని, బృందంలో 15 మంది ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు కృష్ణయ్య, రమేశ్ మాస్టర్, మనీషా యాదవ్, చిన్నారి, శ్రావణి, నిఖిత, అనూష, బుగ్గేశ్, సిద్ధు, నిఖిల్‌యాదవ్, బ్రహ్మేంద్ర, పెంటప్ప, మాణిక్యం పాల్గొన్నారు.


అయోధ్యలో జానపద కళాకారుల బృందం

కార్యకర్తలకు సముచిత స్థానం ఇచ్చే పార్టీ కాంగ్రెస్


సమావేశంలోల మాట్లాడుతున్న పార్లమెంట్ సభ్యుడు రాబర్ట్ బ్రూస్

చందానగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్త అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొని పార్టీ బలోపేతానికి కృషిచేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని తమిళనాడు రాష్ట్ర తిరుణెల్వేలి ఎంపీ రాబర్ట్ బ్రూస్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుడి ఎంపిక కోసం అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ హుడా కాలనీ ఏఎంసీ కన్వెన్షన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహంచారు. కార్యక్రమానికి రాబర్ట్ బ్రూస్, పీసీసీ ఉపాధ్యక్షుడు కోటంరెడ్డి వినయ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి, పీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షుడు నల్ల సంజీవ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాబర్ట్‌బ్రూస్ మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడే ప్రతీ కార్యకర్తను గుర్తించి సముచిత స్థానాన్ని కల్పించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి అందరికీ ఆమోదయోగ్యమైన నాయకుడితోనే సాధ్యమన్నారు. అలాంటి నాయకుడి ఎంపిక కోసం కార్యకర్తల,నాయకుల అభిప్రాయ సేకరణకు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కోటంరెడ్డి వినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. పీసీసీ ఆదేశాలతోనే అభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ యువతకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జగదీశ్వరగౌడ్ మాట్లాడుతూ... యువతతోనే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు ,కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర బీమా పథకాలను వినియోగించుకోవాలి : ఎంపీ


సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 2015 నుంచి అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. గురువారం వికారాబాద్, రంగారెడ్డి జి ల్లాల లీడ్ బ్యాంక్ మేనేజర్లు యాదగిరి, సుశీల్ కుమార్‌లతో ఎంపీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. అసంఘటిత కార్మికులు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రమాదవశాత్తు లేదా సహజ మరణం, వైకల్యం వంటి పరిస్థితుల్లో కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ పథకాలు భరోసా కలిస్తున్నాయని విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా పథకాల అమల్లో అగ్రస్థానంలో ఉండడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేసి, అన్ని బ్యాంకు శాఖలను అభినందించారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా 60ఏళ్ల పైబడిన వ్యక్తులు జీవితాంతం నెలకు రూ. వెయ్యి నుంచి 5000 వరకు పింఛన్ పొందే అవకాశం ఉందన్నారు. యువత తమ ఉద్యోగ దశలోనే దీనిలో చేరి భవిష్యత్ భద్రత పొందాలని సూచించారు. కేవలం 20 లేదా 456 చెల్లించడం ద్వారా రుపే కార్డు ద్వారా లక్షల వరకు జీవిత బీమా పొందొచ్చని తెలిపారు. గ్రామీణ యువత, మహిళలు, నిరుద్యోగులు, విద్యావంతులకు రుణాలు, సబ్సిడీల కేటాయింపులో చురుకుగా వ్యవహరించాలని లీడ్ బ్యాంక్ అధికారులను ఎంపీ కోరారు. కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా చేపట్టేందుకు సీఎఫ్ఎల్ సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి, ఎంపీ వ్యక్తిగత కార్యదర్శులు విక్రమ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

మా కార్యదర్శిని డిప్యుటేషన్‌పై పంపొద్దు

● డీపీవో జయసుధకు క్యాద్గీరా, గంగ్వార్ గ్రామస్తుల వినతి


డీపీవో జయసుధకు వినతి పత్రం ఇస్తున్న ప్రజలు

బషీరాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి నిత్యం అందుబాటులో ఉంటూ సేవాలందించే మా గ్రామ కార్యదర్శి శ్రుతిని డిప్యుటేషన్‌పై వేరొక చోటికి పంపించొద్దని క్యాద్గీరా, గంగ్వార్ గ్రామస్తులు వికారాబాద్ డీపీవో జయసుధను కలిసి వినతిపత్రం అందజేశారు. గురువారం యాలాల మండల పర్యటనకు వచ్చిన డీపీవోను పలువురు గ్రామస్తులు కలిసి కార్యదర్శి డిప్యూటేషన్ వెంటనే రద్దు చేయాలని విన్నవించారు. కార్యదర్శి గ్రామాల్లో సమస్యలు రాకుండా చూసుకునేవారని, ఆమెను డిప్యూటేషన్‌పై వేరొక ఊరికి ఎందుకు పంపించారో తెలియడం లేదని వారిచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. తమ గ్రామ కార్యదర్శిపై తామెవరూ ఫిర్యాదు చేయలేదని, డిప్యూటేషన్‌పై ఎందుకు పంపిస్తున్నారని డీపీవోను పలువురు ప్రశ్నించారు. ఎవరైనా రాజకీయాలు చేయాలనుకుంటే పార్టీల పరంగా చూసుకోవాలని, కార్యదర్శి జోలికి వస్తే ఊరుకునేదిలేదని గ్రామస్తులు పలువురు డీపీవో ఎదుట మండిపడ్డారు. గ్రామ కార్యదర్శిని రాజకీయ కుట్రతోనే పంపిస్తున్నారని, వెంటనే డిప్యూటేషన్ రద్దు చేయాలని డీపీవోతో గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. అంతకు క్యాద్గీరా, గంగ్వార్ గ్రామ ప్రజలు కార్యదర్శి డిప్యూటేషన్ రద్దు చేయాలని సబ్ కలెక్టర్, బషీరాబాద్ ఎంపీడీవో కార్యాలయాల్లో వేర్వేరుగా వినతి పత్రాలు అందించారు.

పాదయాత్రగా శబరిమలకు అయ్యప్ప స్వాములు


పాదయాత్రగా శబరిమలకు బయలుదేరిన అయ్యప్పస్వాములు

వికారాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి మాలాధారణ చేసిన వికారాబాద్‌కు చెందిన ఐదుగురు భక్తులు గురువారం పాదయాత్రగా శబరిమలకు బయలుదేరారు. రాకేష్, వెంకట్, శ్రీనివాస్‌గౌడ్, సాయికృష్ణ, శ్రీనివాస్‌లు ఇరుముడి కట్టుకుని అయ్యప్పస్వామి, హనుమాన్ ఆలయాల్లో పూజలు నిర్వహించి పాదయాత్రగా శబరిమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, అయ్యప్పస్వాములు వారి వెంట కొంతదూరం పాదయాత్రగా ముందుకు సాగారు.

కార్తీక పూజలకు కీసర గుట్టకు రండి

● మంత్రి శ్రీధర్‌బాబును కలిసి ఆహ్వాన పత్రికను అందజేసిన ట్రస్టు బోర్డు సభ్యుడు సురేష్‌యాదవ్



మల్కాజిగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాలకు కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకోవాలని కీసర గుట్ట రామలింగేశ్వర స్వామి ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుడు బోనగిరి సురేష్‌యాదవ్ గురువారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు. ఈ నెల 22 నుంచి కార్తీక మాసం ప్రారంభమవుతుందని నవంబరు 20వ తేదీ వరకు రామలింగేశ్వరాలయంలో మాస ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అన్నారు. నెల రోజుల పాటు కొనసాగే కార్తీక మాస పూజల్లో భాగంగా కీసరగుట్టను సందర్శించి స్వామివారి దర్శించుకోవాలని ఆహ్వానించారు. మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేసి శాలువాతో సన్మానించారు.

బీరు సీసాలో వ్యర్థాలు


కింగ్ ఫిషర్ బీరు సీసాలో కన్పిస్తున్న చెత్త

బంట్వారం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బంట్వారంలోని శ్రీ లక్ష్మీ వైన్స్‌లో గురువారం ఓ యువకుడు 5 బీరు సీసాలను కొని ఇంటికి వెళ్లి చూడగా ఓ బాటిల్‌లో చెత్త కన్పించింది. దీంతో అ యువకుడు కింగ్‌ఫిషర్ బీర్ బాటిల్‌ను వీడియో, ఫొటోలను తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. సదరు యువకుడు మాట్లాడుతూ.. పెద్ద బ్రాండ్ అయిన కింగ్‌ఫిషర్ కంపెనీ నుంచి నాణ్యతలేని ఉత్పత్తి రావడం ఏమిటని ప్రశ్నించాడు. ప్రజల ఆరోగ్యం పట్ల కంపెనీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఎక్సైజ్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాన్నారు. స్థానికులు కూడా ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేస్తూ వైన్ షాపుల్లో విక్రయించే మద్యం నాణ్యతపై పర్యవేక్షణ పెంచాలని అధికారులను కోరారు. యువకుడు వైన్‌షాపు వద్దకు చేరుకొని వివరణ కోరగా తమకు సంబంధం లేదని సిబ్బంది అన్నారు. ఈ ఘటనపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రిన్సిపాల్‌కు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు

కొడంగల్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):కొడంగల్‌లోని నవీన ఆదర్శ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ నరేశ్‌రాజ్ డాక్టర్ అబ్దుల్ కలాం స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు, ప్రశంశాపత్రం అందుకున్నారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతితో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్‌డీవో చైర్మన్ సతీశ్‌కుమార్, ఫౌండేషన్ చైర్మన్ సుదర్శన ఆచార్య, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్‌రెడ్డిల నుంచి అవార్డును అందుకున్నారు.


ప్రశంసా పత్రం అందుకుంటున్న అధ్యాపకుడు నరేశ్‌రాజ్



నర్సింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

నిబద్ధత గల నాయకుడు నర్సింహారెడ్డి

» బద్దం వర్ధంతి సభలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బద్దం నర్సింహారెడ్డి నిబద్ధత గల నాయకుడని, చిరకాలం ప్రజల్లో నిలిచి ఉంటాడని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం పోచారంలో జరిగిన బీఆర్ఎస్ నాయకుడు నర్సింహారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలో క్రియాశీలకంగా పనిచేశాడని కొనియాడారు. గతంలో గ్రామాభివృద్ధికి ఆయన కృషి మరువలేనిదన్నారు. పేదల కోసం ప్రజాప్రతినిధులను ఒప్పించి సమస్యల పరిష్కారానికి కృషిచేసిన గొప్పవ్యక్తి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, మాజీ వైస్ ఛైర్మన్ రెడ్డియానాయక్, నాయకులు మందడి సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, బోయపల్లి రాజేశ్వర్‌రెడ్డి, శేఖర్, లక్ష్మారెడ్డి, కుటుంబ సభ్యులు బీఆర్ఎస్ నాయకుడు బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బద్దం మమత, స్థానికులు పాల్గొన్నారు.

తండాలో ఘనంగా భోగ్ బండార్

కడ్తాల్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ తండాలో రాందడియా ఆలయంలో గురువారం భోగ్‌బండార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి హాజరయ్యారు. హథీరామ్ బాబా మఠం పరిరక్షణకై ఈ నెల 18న తిరుపతిలో తలపెట్టిన భోగ్‌బండార్ కార్యక్రమం విజయవంతంపై చర్చించారు. అనంతరం హథీరామ్ భావోజీ బర్తి దివాస్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో కడ్తాల మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, బీచ్యనాయక్, నరేందర్‌నాయక్, శివాజీ, రచ్చ శ్రీరాములు, రాజు, రెడ్యనాయక్, జైపాల్, రమేశ్, రాము, పాండు, గణేశ్, బద్య, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, రఘు, మల్లేశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలకు తరలిరావాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాండు, నాయకులు

తలకొండపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఈ నెల 24, 25వ తేదీల్లో మహబూబాబాద్ జిల్లా గార్లలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు తెలిపారు. మహాసభలకు కార్మికులు భారీగా కదిలొచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తలకొండపల్లిలో గురువారం మహాసభల విజయవంతంపై ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య అధ్యక్షతన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. పాండు, ఇతర నాయకులు మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి సమస్యలు పరిష్కరించాలని పాండు ప్రభుత్వాన్ని కోరారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ మండలాధ్యక్షుడు జంగయ్య, పాండు, రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

రేపు బీసీ బంద్‌ను జయప్రదం చేయాలి



ఐక్యత ప్రకటిస్తున్న బీసీ సంఘాల నాయకులు

కడ్తాల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, మండల అధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్ అన్నారు. బీసీల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. బీసీల రిజర్వేషన్లపై హైకోర్టు స్టేను నిరసిస్తూ ఈ నెల 18న బీసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ విజయవంతంపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రావాల్సిన వాటాను సాధించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్షాలను ఢిల్లీకి తీసుకుపోవాలని డిమాండ్ చేశారు. 18న నిర్వహించే బంద్‌కు అన్ని సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతివ్వాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కులకచర్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కులకచర్ల మండల విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం కుషాయిగూడలో జరిగిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. సాల్విడ్ పాఠశాలకు చెందిన విద్యార్థి వాలీబాల్ అండర్-14 బాలికల విభాగంలో లావణ్య, అండర్-17 విభాగంలో సింధు, ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థి నిత్యశ్రీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

కబడ్డీ జట్టుకు అగస్త్య

పరిగి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పరిగి విద్యార్థి ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. పరిగి పట్టణంలోని ఇండస్‌వ్యాలీ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పడమటి అగస్త్య పరిగి స్టేడియంలో జరిగిన కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అగస్త్యను పాఠశాల ప్రిన్సిపాల్ పి.సునీల్‌కుమార్, పీడీ రాజేందర్ అభినందించారు.

మధ్యాహ్న భోజన మెనూ పాటించాలి

» నిర్లక్ష్యం చేశారని ఇన్‌చార్జి హెచ్‌ఎంపై సబ్ కలెక్టర్ ఆగ్రహం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఉమాశంకర్‌ప్రసాద్

తాండూరు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం చెంగోల్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించేలా చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్ ఆదేశించారు. గురువారం పాఠశాలలో భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తుండగా మెనూ ప్రకారం పప్పు చేయాల్సి ఉండగా నీళ్ల చారు, సాంబారు చేయడంతో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ తప్పక పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.. పాఠశాల పరిసరాల పరిశుభ్రత ఎలా ఉంది, రెగ్యులర్‌గా గుడ్లు ఇస్తున్నారా? అనే విషయాలపై ఆరా తీశారు. ఆయన వెంట తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీవో విశ్వప్రసాద్, పంచాయతీ కార్యదర్శి అశోక్, కాంగ్రెస్ నాయకుడు రాము ఉన్నారు.

ఎర్రమట్టి తవ్వకాలను ఆపాలి

● లేదంటే ఆందోళనలు చేపడతాం

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్



అంతారంలో ఎర్రమట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు రమేశ్

తాండూరు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అంతారంలోని సర్వే నం 2 అసైన్డ్ భూమిలో ఎర్రమట్టి తవ్వకాలను ఆపకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేశ్ హెచ్చరించారు. గురువారం అంతరాంశివారు అసైన్డ్ భూమిలో అనుమతులు లేకుండా చేపడుతున్న ఎర్రమట్టి తవ్వకాలను ఆయన పరిశీలించారు. కాంట్రాక్టర్ కృష్ణమోహన్ రెండు ఎకరాల్లో పెద్ద గోతులు తీస్తూ ఎర్రమట్టిని తవ్వడం దుర్మార్గమని రమేశ్ అన్నారు. ఇదే విషయాన్ని ప్రశ్నిస్తే అనుమతి కోసం రెవెన్యూ, మైన్స్ అధికారులకు దరఖాస్తు చేశామని చెప్పారు. అనుమతి లేకుండా ఎలా తవ్వుతారని రమేశ్ ప్రశ్నించారు. ఎర్రమట్టి తవ్వకాలతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై తహసీల్దార్ తారాసింగ్‌ను సంప్రదించగా తాము అనుమతివ్వలేదని, ఇది మైన్స్ శాఖ అంశం అని పేర్కొన్నారని తెలిపారు. కలెక్టర్ చొరవ తీసుకొని ఎర్రమట్టి తవ్వకాలను నివారించకుంటే ఆందోళనలు చేస్తానని రమేశ్ అన్నారు. ఆయనతో శ్రీశైలం, సందీప్ ఉన్నారు.

మళ్లీ మొదటికి..

(మూడో పేజీ తరువాయి)



పేరుతో ఒక్కో గ్రామంలో లక్షలు ఖర్చుపెట్టారు. హైకోర్టు తీర్పు తర్వాత వీరంతా కొంత నిరాశ చెందినప్పటికీ సుప్రీంలోనైనా ఊరట దక్కుతుందని భావించారు. కానీ అక్కడ కూడా అనుకూలంగా తీర్పు రాకపోవడంతో తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. పాత విధానంలో ఎన్నికలు నిర్వహిస్తే రిజర్వేషన్లన్నీ తారుమారవుతాయి. దీంతో తమ రాజకీయ జీవితం కూడా తారుమారవుతుందని ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి ఈ సారి స్థానిక ఎన్నికల్లో 42శాతం బీసీలకు రిజర్వు చేయాలని సర్కార్ నిర్ణయించడంతో ఈ వర్గాల వారు ఈ రిజర్వేషన్ ఫలాలు పొందేందుకు ఆశగా ఎదురు చూశారు. ఇపుడు వారి ఆశలన్నీ అడియాలయ్యాయి.

కుల గణన ఆధారంగా పరిశీలిస్తే..

ఒకవేళ ప్రభుత్వం తప్పని పరిస్థితిలో పాత విధానంలోనే ఎన్నికలు నిర్వహిస్తే ఇటీవల ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ స్థానాల్లో ఎలాంటి మార్పు ఉండదని చెబుతున్నారు. అలాగే బీసీలకు ఇపుడు ఇచ్చిన 42శాతం రిజర్వేషన్లకు స్థానంలో గతంలో మాదిరే 22శాతం లోపు జనాభా ప్రాతిపదికన ప్రాధాన్యత క్రమంలో ఆయా ప్రాంతాల్లో బీసీ రిజర్వుడు స్థానాలను కోటా ప్రకారం బదలాయించే అవకాశాలు ఉన్నాయి. ఉదాహరణకు గతంలో 42శాతం రిజర్వేషన్ ప్రకారం బీసీలకు 9 జెడ్పీటీసీ స్థానాలు రిజర్వుడు చేస్తే ఇపుడు 22శాతం ప్రకారం 4 సీట్లు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే గతంలో ఇచ్చిన స్థానాల స్థానే ఆరు స్థానాలను ఇపుడు రిజర్వుడు చేయాల్సి ఉండగా ఇందులో ఐదు స్థానాలను మినహాయించాలి. బీసీ జనాభాలో అధికంగా ఉన్న నాలుగు సీట్లను ఇప్పుడు రిజర్వు చేసి మిగతా వాటిని జనరల్ చేస్తారని, దీంతో కొంత కసరత్తు తగ్గుందని చెబుతున్నారు. మరో వైపు ఎస్సీ, ఎస్టీలు కూడా కులగణన సర్వే ఆధారంగా తమ జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక వీరి డిమాండ్‌ను కూడా పరిశీలిస్తే రిజర్వేషన్లపై కసరత్తు మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి ఉంటుంది. కులగణన సర్వే ద్వారా వచ్చిన వివరాల ప్రాతిపదికన బీసీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు జెడ్పీ ఛైర్‌పర్సన్, ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డు స్థానాల్లో రిజర్వేషన్లు కల్పిస్తారు.

యంత్రాంగం ఎదురుచూపులు ..

మరో వైపు న్యాయస్థానం తీర్పుతో ఎన్నికల నిర్వహణపై అధికారులు ప్రభుత్వ తాజా ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి నోటిఫికేషన్ అనంతరం నామినేషన్లు స్వీకరించే సమయంలో ఎన్నిలకు బ్రేక్ పడిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు ఎన్నికలపై సర్కార్ తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా కసరత్తు చేసేందుకు అధికారులు మళ్లీ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జనాభా, ఓటర్ల జాబితాలు రెడీగా ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలను ఖరారు చేయడంతోపాటు బ్యాలెట్ పేపర్లు, ఇతర ఎన్నికల సామగ్రి సైతం అందుబాటులో ఉంది.

ఆస్పత్రుల్లో అభివృద్ధి జాడేది?



అంగడిరైచూర్‌లోని ఆరోగ్య కేంద్రం

● నిర్వహణ లేక తప్పని ఇబ్బందులు

కొడంగల్ రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రులకు వచ్చే రోగులకు స్థానికంగా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మౌలిక వసతులు కల్పించాలి. ఆసుపత్రిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలి. అయితే ఆస్పత్రుల నిర్వహణపై ఏర్పాటు చేసిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అటకెక్కింది. గతంలో పాలకవర్గ సభ్యులు ఛైర్మన్‌గా వ్యవహరించారు. వారి పదవీ కాలం ముగియడంతో మండల స్థాయి అధికారులైన ఎంపీడీవో, తహసీల్దార్‌లు ఆసుపత్రి కమిటీ సభ్యులుగా ఉంటారు. ప్రతి మూడు నెలలకోకసారి ఈ అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ఆసుపత్రిల్లో సమస్యలను గుర్తించి, పరిష్కారానికి అందుబాటులో ఉన్న నిధులు ఖర్చుచేయాలి. అయితే నాలుగేళ్లుగా నిధులు విడుదల కాలేదని సమాచారం.

హేమ్‌లాల్‌కు ఉత్తమ రైతు అవార్డు



రైతు హేమ్‌లాల్‌ను సన్మానిస్తున్న కంపెనీ మేనేజర్ సురేందర్

ఆమనగల్లు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పత్తిసాగులో అధిక దిగుబడి సాధించిన పలుగు తండా వాసి మూడావత్ హేమ్‌లాల్‌ను ఉత్తమ రైతుగా ఎంపిక చేశారు. గురువారం పవర్ సీడ్ కంపెనీ ఆధ్వర్యంలో హేమ్‌లాల్‌కు వ్యవసాయ క్షేత్రం వద్ద అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కంపెనీ మేనేజర్ సురేందర్ రైతును సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. అధిక దిగుబడులు సాధించిన హేమ్‌లాల్‌ను రైతులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అ్యక్షుడు మోతీలాల్‌నాయక్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

శామీర్‌పేట, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):రోడ్డు భద్రత నియమాలను వాహనాలను తప్పక పాటించాలని, జాగ్రత్తగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలను నివారించాలని సైబరాబాద్ మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. గురువారం తూంకుంట పరిధి దొంగల మైసమ్మ చౌరస్తా వద్ద రాజీవ్ రహదారిలో డీసీపీ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్సైలు దశరథ్, రమేశ్, కానిస్టేబుళ్లు వాహనాల తనిఖీ చేపట్టారు. డీసీపీ మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే వాహనదారులకు, రోడ్డు వెంట వెళ్లే వారికి ఇలా అందరికీ క్షేమకరం అని అన్నారు. అతి వేగం, అజాగ్రత్తల వల్లే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. ప్రతీ వాహనదారుడు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రోడ్డుపై మెదలాలని కోటిరెడ్డి సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో సాగు చేద్దాం



షాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేస్తే సమయం ఆదా అవుతుందని అకిన్ అనలెటిక్స్ డైరెక్టర్ ఎస్.సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ అమృత్ రాజ్ అన్నారు. గురువారం రేగడిదోస్వాడలో అకిన్ అనలెటిక్స్ కంపెనీ, సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో డ్రోన్‌తో పంటలపై పురుగు మందులు, ఎరువుల పిచికారిపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. డ్రోన్ వాడితే సమయం ఆదా అవుతుందన్నారు. రైతులకు శ్రమ తగ్గడంతో పాటు మొక్క మొత్తం తడిసేలా పిచికారి చేయగల్గుతామని చెప్పారు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో స్ప్రే చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎకరా పొలంలో 5 నుంచి 6 నిమిషాల్లో స్ప్రేయింగ్ పూర్తవుతుందని, సాధారణ స్ప్రేయర్లతో గంట నుంచి రెండు గంటలు పడుతుందన్నారు. తెగుళ్లు సోకినపుడుతు ప్రాథమిక దశలోనే పిచికారి చేయాలని, ఆ సమయంలో కూలీలు దొరక్క పిచికారి ఆలస్యమైతే పంట దిగుబడి నష్టపోతామని తెలిపారు. డ్రోన్లు వచ్చాక ఆ ఇబ్బంది తప్పిందని, పురుగు మందును కూడా ఆదా చేయొచ్చన్నారు. పిచికారితో రైతులకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు సైతం తప్పాయన్నారు. సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం వాడకంతో పురుగు మందుల వ్యయం, శ్రమ, ఖర్చు, నీటి అవసరాన్ని తగ్గించొచ్చని, డ్రోన్లతో ప్రభావవంతంగా, ఏకరీతిగా పురుగుల మందును పిచికారి చేయవచ్చని చెప్పారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని సాగు చేస్తే పెట్టుబడులు తగ్గుతాయన్నారు. అలాగే దిగుబడులు సైతం పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో డ్రోన్ పైలెట్స్ పవన్, మనోజ్‌కుమార్, దిలీప్‌కుమార్, రైతులు ప్రవీణ్, మాధవరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్, చంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రికి త్వరలో ఐసీయూ

» ఆకస్మిక తనిఖీలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



జిల్లా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో త్వరలో ఐసీయూ ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆస్పత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే జనరల్ వార్డు, డయాలసిస్ కేంద్రం, నర్సింగ్ కళాశాలను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సిబ్బంది హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. జనరల్ వార్డులో వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఆస్పత్రి భవనం లీకేజీల మరమ్మతులపై కలెక్టర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. ఆస్పత్రి ఎదుట ఉన్న మురుగును రెండు రోజుల్లో దారి మళ్లిస్తామన్నారు. వైద్యులు ఆస్పతిలో ఆపరేషన్ల సంఖ్యను పెంచాలన్నారు. ఆస్పత్రిలో పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని వైద్యులు కోరాగా ఎమ్మెల్యే సీఐతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్యం, నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్‌కుమార్, ఆర్ఎంఓ ఆనంద్ కుమార్‌రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ మూర్తి, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, డీసీసీబీ వైస్ ఛైర్మన్ రవి గౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బాల్‌రెడ్డి ఉన్నారు.

ఫ్యాక్టరీ వ్యర్థాలతో ఉక్కిరిబిక్కిరి


తండా సమీపంలో పారబోస్తున్న వీబీఎస్ కంపెనీ



తగలబడుతున్న వ్యర్థాలు

ఫూడూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వీబీఎస్ ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. జనావాసాల్లో కంపెనీ వ్యర్థాలను తగలబెతూ ప్రజారోగ్యాన్ని పాడుచేస్తోంది. పూడూరు మండలం రాకంచర్ల ఇండస్ట్రియల్ ఏరియాలో వీబీఎస్ ఫ్యాక్టరీ ఉంది. ఇక్కడ స్టీలు తయారీ అనంతరం వచ్చే వ్యర్థాలను చినబండతండా సమీపంలో డ్రమ్ములు, పాలిథిన్ కవర్లలో వేసి పారబోస్తున్నారు. కొందరు అక్కడే కెమికల్ వ్యర్థాలను కూడా పారబోస్తున్నారు. గురువారం వ్యర్థాలను తగలబెట్టడంతో మంటలు చెలరేగి పొగలు కమ్ముకున్నాయి. పొగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని తండా వాసులు వాపోతున్నాపరు. ఈ పొగలతో వ్యాధులు వస్తున్నాయని యాజమ్యానానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని, తమను గేటు లోపలికి అనుమతించడం లేదని చెప్పారు. అధికారులు, పీసీబీ ఫ్యాక్టరీని మూసివేయించి డిమాండ్ చేశారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదిభట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో, విద్య ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ జన సమితి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామ నిరంజన్ అన్నారు. గురువారం తహసీల్దార్ అయప్పకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుల గణన నిర్వహించి, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. బీసీ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఆయనతో రమేష్ తదితరులు ఉన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక ఆలయాలు


విగ్రహప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆలయాలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, ప్రతాప్‌సింగారంలో నూతనంగా నిర్మించిన శ్రీ కంఠమహేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్‌సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ శివకుమార్, వంగూరి శివశంకర్, అబేదా బేగం, బద్దం కుమార్, ప్రభాకర్‌గౌడ్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, నత్తి కృష్ణ, బాల్‌రాజ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి

కీసర రూరల్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధి సుర్వి బాబయ్య ఫంక్షన్‌హాల్‌లో గురువారం అంగీకార్-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి స్వనిధి, ఆయుష్మాన్‌భారత్, ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త బిజిలీయోజన, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన2.0తదితర పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నారాయణరెడ్డి, డీఈఈ సంతోష్‌కుమార్, రెవెన్యూ ఆఫీసర్ నాగేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిరాజ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ప్రవన్‌కుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు


ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ దశరథ్‌సింగ్

కులకచర్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని హౌసింగ్ పీడీ దశరథ్ సింగ్ రాథోడ్ అన్నారు. మండలంలోని కామునిపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 20 మండలాలకు 13,464 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. అందులో 7,247 ఇళ్లకు మార్కౌట్ ఇచ్చినట్లు తెలిపారు. బేస్‌మెంట్ లెవల్‌లో 4,279 ఉండగా, రూఫ్‌లెవల్‌లో 916, స్లాబ్ లెవల్‌లో 213 ఉండగా 12 ఇళ్లు పూర్తయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సయ్యద్ ముక్రంబాబా, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ, గోపాల్‌నాయక్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం


బషీరాబాద్ పంచాయతీ వద్ద సీసీరోడ్డు నిర్మాణ పనులు

బషీరాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ నుంచి జీవన్గి మీదుగా కరణ్‌కోట్ వరకు గల రోడ్డును అభివృద్ధి పర్చేందుకు రూ.30 కోట్లు మంజూరయ్యాయి. రోడ్డంతా బురదమయం! శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి స్పందించారు. ఈ క్రమంలో కాంట్రాక్టర్ నెల కింద పంచాయతీ ఎదుట సీసీ రోడ్డు నిర్మాణానికి ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీశారు. కొంత మొరం పోసి పనులు వదిలేశారు. దీంతో రోడ్డంతా బురదమంగా మారింది. స్పందించిన ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించేలా ఆదేశించారు. రోడ్డు పనులు ప్రారంభంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వికారాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ పట్టణంలోని మేరీ ఏ నాట్స్ హైస్కూల్‌లో 1983లో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 42ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమతో పాటు చదువుకున్న స్నేహితులను ఆప్యాయంగా పలకరించి అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఎవరెవరు ఏయే రంగాల్లో స్థిరపడింది వివరించి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులు ప్రభాకర్, ఫరీదాబేగం, కళావతి తదితరులను ఘనంగా సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

కులకచర్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరికీ అవగాహన అవసరమని స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం 108 సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కీసర: కీసర ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీపీఆర్‌పై అవగహన సదస్సు ఏర్పాటు చేశారు. ఐగ్రీన్ హెల్త్‌సంస్థ అధ్వర్యంలో గురువారం కీసర ప్రభుత్వ పాఠశాలలో సీపీఆర్‌పై పదో తరగతి పిల్లలకు అవగహన కల్పించారు. అదేవిధంగా 108సేవలను ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు.

మోమిన్‌పేట: సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉంటే నిండు ప్రాణాన్ని కాపాడవచ్చని సీహెచ్‌వో శకుంతల, ఎంఎల్‌హెచ్‌పీ షరున్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం 108 సిబ్బందితో ప్రజలకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వైద్యులు, 108 సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది దినావతి, నవీన్, వినోద, కృష్ణ, జావీద్, తాజోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కులకచర్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. స్థానిక కేజీబీవీని గురువారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యనందించి పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. వంటగది, సరుకులు, భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిధుల్లేక.. పనులు సాగక

- అభివృద్ధికి దూరంగా గ్రామాలు
- పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక భారం

బషీరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో 20 నెలలుగా పాలకవర్గాలు లేక ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతోంది. నిధులు లేక.. పనులు సాగక పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది. చెత సేకరణకు వినియోగించే ట్రాక్టర్లకు డీజిల్‌తో పాటు వాటి మరమ్మతులు చేపట్టడానికి కార్యదర్శులు సొంతగా వారానికి రూ.2వేల నుంచి రూ.4వేల వరకు వెచ్చిస్తున్నారు. వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్య పనులు, తాగునీటి వసతి, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, పారిశుధ్య కార్మికులకు వేతనాలు, బోర్ల మరమ్మతులు, పైపులైన్ లీకేజీలు, డీజిల్ ఖర్చులు తదితర పనులకు గానూ చిన్న, పెద్ద పంచాయతీలకు నెలకు రూ.10 నుంచి 15 వేలకు పైగా ఖర్చు అవుతోందని కార్యదర్శులు వాపోతున్నారు. ఈ క్రమంలో కార్యదర్శులు ఆర్థిక భారంతో సతమతమవుతున్నారు. కొన్ని చోట్ల వీధిదీపాల నిర్వహణను పూర్తిగా వదిలేశారు.

నిలిచిన నిధులు

గ్రామాల్లో ప్రత్యేకాధికారులు 2024 ఫిబ్రవరి నెలలో బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు నిలిచిపోయాయి. ఇంటి, నల్లా, వాణిజ్య సముదాయాల పన్నులను వసూలు చేసి ఖజానాలో జమ చేసిన తర్వాత వాడుకుంటున్నారు. మరి కొందరు ఆర్థిక భారం భరించలేక కార్యదర్శులు వసూలైన పన్నుల డబ్బులను ఖర్చుల నిమిత్తం వినియోగిస్తూ బిల్లులు అందుబాటులో పెట్టుకుంటున్నారు.


బషీరాబాద్ పంచాయతీలో టైరు పగలి నడిరోడ్డుపై నిలిచిపోయిన చెత్తసేకరణ ట్రాక్టర్

పట్టింపులేని ప్రత్యేకాధికారులు

పాలకవర్గాల పదవీకాలం పూర్తయిన తర్వాత పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. వారు అప్పటికే వారి పనులు, బాధ్యతలో తీరిక లేకుండా ఉంటున్నారు. ఇలాంటి సందర్భంలో వారికి అదనపు బాధ్యతలు అప్పటించారు. ఒక్కొక్కరికీ మూడు, నాలుగు గ్రామపంచాయతీలు కేటాయించారు. ఈక్రమంలో వారు పంచాయతీల పాలనను పెద్దగా పట్టించుకోవడం లేదు. కనీసం నెలకొకసారి కూడా పంచాయతీలను సందర్శించడంలేదనే విమర్శలున్నాయి.

రేపటి తెలంగాణ బంద్‌కు సహకరించాలి


వికారాబాద్: వినతిపత్రం అందజేస్తున్న బీసీ నాయకులు

వికారాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రేపటి(శనివారం) నిర్వహించతలపెట్టిన తెలంగాణ బంద్‌కు వ్యాపారులు, విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిసె లక్ష్మణ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో గురువారం బీసీ కుల సంఘాల నాయకులు వ్యాపార, వాణిజ్య సంఘాలు, విద్యా సంస్థల ప్రతినిధులను కలిసి శనివారం(రేపు) జరిగే తెలంగాణ బంద్ విజయవంతమయ్యేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల నాయకులు పి.శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ శేఖర్, వెంకట్, లక్ష్మణ్, వెంకట్‌దాస్, పాండు, శంకర్, సత్యనారాయణగౌడ్, కోడి లక్ష్మణ్ పాల్గొన్నారు.

అన్ని వర్గాలు మద్దతు పలకాలి

తెలంగాణ బంద్‌కు స్వచ్ఛందంగా అన్ని వర్గాలు మద్దతు పలకాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఆర్ కృష్ణ కోరారు. బీసీల రిజర్వేషన్లకు అడ్డుకోవడం బీసీల నోటి కాడి ముద్దను లాక్కోవడమేనని ఆయన గురువారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

తాండూరు: బీసీ జేఏసీ ప్రకటించిన తెలంగాణ బంద్‌కు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మద్దతు ఇస్తున్నదని జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మల్లికార్జున మాదిగ అన్నారు. గురువారం ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు పరుశురామ్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. అదేవిధంగా బీసీ బంద్‌కు మద్దతు ఇవ్వాలని పలుసంఘాలు, వ్యాపార వేత్తలు, విద్యా సంస్థలకు బీసీ జేఏసీ నాయకులు రాజ్‌కుమార్, ఈడ్గి శ్రీనివాస్ గౌడ్, టిజేఏస్ నాయకులు సోమశేఖర్ విన్నవించారు. పట్టణంలోని టిఎస్ ఆర్టీసీ డీఎం సురేష్‌తో పాటు ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్, కళాశాలల యజమాన్యం, క్లాత్, రెడిమెంట్, గ్రేన్ అండ్ సీడ్స్, కిరాణ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులకు ఈ సందర్భంగా విన్నవించారు.

బంట్వారం: మండల కేంద్రంలో గురువారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బీసీ నాయకులు సమావేశమై శనివారం(రేపు) నిర్వహించనున్న తెలంగాణ బంద్‌కు మద్దతు ప్రకటించారు. 18న మండల కేంద్రంతో సహా పరిసర గ్రామాల్లోని అన్ని వ్యాపార సంస్థలు, షాపులు, విద్యాసంస్థలు, రవాణా సేవలు బంద్‌లో భాగంగా మూసివేయాలన్నారు.


తాండూరు బంద్‌కు సహకరించాలని విన్నవిస్తున్న బీసీ జేఏసీ నాయకులు

బంద్‌కు బీజేపీ సంపూర్ణ మద్దతు


ఆశిరెడ్డి

మోమిన్‌పేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ల కోసం బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 18న జరిగే రాష్ట్ర బంద్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతు ఇవ్వనున్నట్లు మోమిన్‌పేట్ మండల బీజేపీ అధ్యక్షుడు ఆశిరెడ్డి అన్నారు. 42 శాతం రిజర్వేషన్‌లతో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిన తర్వాత హైకోర్టు స్టే ఇవ్వడం బీసీలను మోసం చేయడమేనని ఆరోపించారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించవచ్చునని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం కింద రైతులకు ఉచితంగా శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతారాథోడ్‌సింగ్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాజరత్నం, ఏడీఏ వెంకటేశ్, వ్యవసాయ అధికారులు జ్యోతి, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

రైతులకు వ్యవసాయ పద్ధతులు, రిజిస్ట్రేషన్ పీఎం కిసాన్ తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ అధికారులకు గురువారం మండల కేంద్రంలో వీడియో కాన్ఫరెన్స నిర్వహించారు. రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజరత్నం, ఏఈవోలు జ్యోతి, ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

కొడంగల్ రూరల్: చిట్లపల్లిలో కడా నిధులు రూ.20లక్షల నిర్మించనున్న నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి గురువారం మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మండల పార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్‌గుప్తా, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవలో ముందుండాలి

ఘట్‌కేసర్: విద్యార్థులు విద్యతోపాటు సమాజ సేవలో ముందుండాలని స్ఫూర్తి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కె.యాదగిరి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్‌లోని సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం 'మార్పు కోసం' అంశంపై అవగాహన కల్పించారు. నిర్వాహకుడు హరిప్రసాద్, పరశురాం పాల్గొన్నారు.

విత్తన పంపిణీలో గోల్‌మాల్!

(మూడో పేజీ తరువాయి)

సాగవుతోందని అధికారులు తెలిపారు. అధిక దిగుబడినిచ్చే విత్తనాలను ఎంపిక చేసిన గ్రామాలకు ఉచితంగా పంపిణీ చేసి 3,375 ఎకరాల్లో సాగు చేయాలని భావించారు. అయితే ఈ విత్తనాలను అదును దాటిన తర్వాత అందివ్వడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే వేరుశనగ విత్తడం దాదాపుగా పూర్తికాగా మొలకెత్తిన పొలాల్లో కలుపు కూడా తీస్తున్నారు.

అధికార పార్టీ నేతల కన్ను!

రాయితీ వేరుశనగ విత్తనాలపై అధికార పార్టీ నేతల కన్నుపడింది. అధికారులతో కుమ్మక్కై ఉచిత విత్తనాలను పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు మాత్రం అర్హత గల రైతులకే పంపిణీ చేశామని చెబుతున్నా ఆచరణలో అందుకు విరుద్ధ పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొందరు నాయకులు అనుచరులకు సంబంధించి ఆధార్, పట్టా పాసు పుస్తకాలతో ఉచిత రాయితీ విత్తనాల బస్తాలను మార్చి బయటి మార్కెట్‌లో అమ్మి రూ.లక్షల్లో లావాదేవిలు చేసినట్లు సమాచారం. ఏవోల ప్రమేయంతో కొందరు అధికార పార్టీ నాయకులు అక్రమార్జనకు పాల్పడుతనాన్నారు. ఎవరైనా రైతులు అడిగితే ఏవోలు, ఏఈవోల దబాయిస్తున్నారు. మా పని మేం చేశాం. ఏం చేసుకుంటారో చేసుకోండని వింత సమాధానాలు ఇస్తున్నారు. తమకు అధికార పార్టీ నేతల అండదండలు ఉన్నాయని, ఎవరూ ఏం చేసిన ఏం కాదనే ధీమాను అధికారులు వ్యక్తం చేస్తుండడం గమనార్హం. మొత్తమ్మీద 80 శాతం సబ్సిడీ విత్తనాలు దారి మళ్లించినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. బుధవారం రాత్రి దౌల్తాబాద్ మండలం గోకపసలవాద్‌లో ఓ డీసీఎంలో వచ్చిన ఉచిత విత్తనాల బస్తాలు మార్చి తరలించేందుకు యత్నించినట్లు తెలిసింది. అయితే గ్రామస్తులు కొందరు నిఘా పెట్టడంతో రాత్రి రైతు వేదికలో దింపినట్లు సమాచారం.

పక్కదారికి అవకాశం లేదు



జిల్లాలోని ఎనిమిది మండలాల్లో ఉచిత, 50 శాతం రాయితీ విత్తనాలు పంపిణీ చేశారు. 2025 క్వింటాళ్ల ఉచిత వేరుశనగలు, 1,012 క్వింటాళ్ల 50 శాతం రాయితీ విత్తనాలు పంపిణీ అయ్యాయి. ర్హత గల రైతులకే పట్టాపుస్తకాలు, ఆధార్ తీసుకొని పంపిణీ చేశాం. విత్తనాల పంపిణీలో గోల్‌మాల్‌కు అవకాశం లేదు. ఎక్కడైనా అలా జరిగినట్లు ఆధారాలు చూపిస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

- రాజారత్నం, జిల్లా వ్యవసాయాధికారి

వేరుశనగ విత్తనాల డీసీఎం బోల్తా

దోమ: వేరుశనగ విత్తనాల లోడ్‌తో తీసుకెళ్తున్న ఓ డీసీఎం బోల్తాపడింది. ఈ ఘటన దోమ మండలంలోని మోత్కుర్ శివారులో జరిగింది. మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బ్రహ్మణపల్లి రైతు వేదికకు 18క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ విత్తనాలు రావాల్సి ఉంది. బుధవారం మహబూబ్‌నగర్ నుంచి వస్తున్న డీసీఎం దుద్యాల మండలం నుంచి దాదాపూర్, కులకచర్ల, మోత్కుర్ మీదుగా బ్రహ్మణపల్లికి వస్తోంది. ఈ క్రమంలో రాత్రి సమయంలో మోత్కుర్ గేటు వద్ద బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా అందులో ఉన్న 90బస్తాల వేరుశనగ విత్తనాల బస్తాల్లో స్థానికులు దాదాపు 20బస్తాల వరకు ఎత్తుకెళ్లారు. మిగతా బస్తాలు నీళ్లలో తడిసి ముద్దయ్యాయి. దీంతో డ్రైవర్ ఆందోళనకు గురయ్యాడు. రైతులకు అందించే విత్తనాలు కావడంతో ఇన్‌టైమ్‌లో అందకపోవడంతో అధికారులు తమకు వద్దంటూ తిప్పి పంపించారు.

సంక్షిప్తంగా..

'సూర్య ఘర్'పై అవగాహన

బషీరాబాద్: పీఏం సూర్యఘర్ యోజన పథకంపై బషీరాబాద్ గ్రామ పంచాయతీలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. టీజీఎస్‌పీడీసీఎల్ ఏఈ ఆరవింద్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాములు రూఫ్‌టాప్ సోలార్ ఎనర్జీ వ్యవస్థకు ప్రభుత్వం కిలోవాట్‌కు రూ.30వేలు సబ్సిడీ ఇస్తోందన్నారు.

స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతులు

బొంరాస్‌పేట: రేగడిమైలారంలో గ్రామ పంచాయతీ వద్ద అంతర్గత రోడ్డు అధ్వానంగా మారడంతో గ్రామస్థులు స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. గ్రామస్థులందరూ కలిసి మొరం తెప్పించి చదును చేశారు కార్యక్రమంలో చంద్రప్ప, అంజయ్య, రాములు, హన్మయ్య, బసప్ప, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

భయాన్ని వీడి చదవాలి

దుద్యాల: విద్యార్థులు పరీక్షలపై భయాన్ని వీడి చదవాలని ఎస్సై యాదగిరి అన్నారు. దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రవితేజ, కృష్ణ, శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయాలి

తాండూరు రూరల్: కరన్‌కోట్ గ్రామ పంచాయతీలోని ముదిరాజ్ కాలనీ, ఎస్సీ, గౌడ్స్ కాలనీల్లో చాలా చోట్ల విద్యుత్ దీపాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం పంచాయతీ కార్యదర్శికి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

కీసర: కీసరలోని బంగారు మైసమ్మ ఆలయ పునః నిర్మాణానికి దాతలు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. ఈ మేరకు గురువారం కీసర గ్రామానికి చెందిన కాటపల్లి సంజీవరెడ్డి రూ.51వేల విరాళంగా అందజేశారు. నిర్వాహకులు సంజీవరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు.

నేరాల కట్టడికి సీసీ కెమెరాలు దోహదం

దుద్యాల: నేరాల కట్టడికి సీసీ కెమెరాలు దోహదపడతాయని మాజీ ఎంపీపీ గోపినాయక్ అన్నారు. చిలుముల్‌మైలారంలో గురువారం రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో పుట్టేబిడ్డ క్షేమం

కోట్‌పల్లి/శామీర్‌పేట: సరైన పోషకాహారంతో పుట్టబోయే బిడ్డ క్షేమంగా ఉంటుందని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం డ్వాక్రా భవనంలో బాలింతలు, గర్భిణులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రప్ప, ధనలక్ష్మి, లక్ష్మణ్, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు. అదేవిధంగా శామీర్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ నాగమణి ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ పిల్లలకు అన్న ప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణి స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమాలను నిర్వహించారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన

కోట్‌పల్లి: మాదకద్రవ్యాల నివారణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కమ్యూనిటీ ఎడ్యుకేటర్ మధు, రాందాస్ అన్నారు. మహిళాశిశు సంక్షేమ శాఖ అధ్యక్షతన జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నషాముక్త్‌భారత అభియాన్ 5వ వార్షికోత్సవ వేడుకలు జిల్లా పరిషత్ పాఠశాల కోట్‌దపల్లిలో నిర్వహించారు.

క్రైం కార్నర్

కారు ఢీకొని యువకుడి మృతి


శ్రీనివాస్(ఫైల్)

వికారాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కోట్‌పల్లి మండలం, మోత్కుపల్లికి చెందిన అనంతగిరిపల్లి శ్రీనివాస్ అలియాస్ శ్రీను(25) వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి కమలానగర్‌లో నివాసముండే తన స్నేహితుడిని బైక్‌పై ఇంటివద్ద దింపి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మర్రి చెన్నారెడ్డి విగ్రహం సమీపంలో హైదరాబాద్ వైపు అతివేగంగా వెళుతున్న ఓకారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

యాలాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కోకట్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోకట్ గ్రామానికి చెందిన బ్యాగరి రమేశ్(45) వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రమేశ్ భార్య తనను వదిలిపెట్టి పుట్టింటికి వెళ్లడంతో ఆయన మద్యానికి బానిసై ఎలాంటి పనిచేయకుండా ఇంటివద్దే ఉంటున్నాడు. తనవద్ద డబ్బులు లేకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన రమేశ్ గురువారం గ్రామంలోని తనకు చెందిన పశువులు కట్టే ప్రదేశంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

పెళ్లి సంబంధాలు చెడగొడుతున్నాడని ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వేరొక అమ్మాయిని పెళ్లి చేసుకున్న ప్రియుడు తన పెళ్లి సంబంధాలు చెడగొడుతున్నాడని ఓ యువతి పోచారం ఐటీ కారిడార్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీకి చెందిన ఓయువతి(28) కాచిగూడకు చెందిన ఏ.నిఖిల్(33)తో 2015 నుంచి ప్రేమించుకొని పెళ్లి చేసుకోవాలనుకున్నారు. కానీ 2023లో నిఖిల్ ఇంట్లో తల్లిదండ్రులు కుదుర్చిన మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి ప్రేమించిన యువతితో నిఖిల్ మాట్లాడటం మానేశాడు. కొన్నిరోజులుగా నువ్వులేకుండా నేను బతకలేనని, నువ్వు మరొకరిని పెళ్లి చేసుకుంటే నీ అంతు చూస్తానని యువతిని నిఖిల్ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. తనతో మాట్లాడకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని యువతి పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బందోబస్తు మధ్య ప్రారంభోత్సవం

(మూడో పేజీ తరువాయి)

ప్రారంభించాలన్నారు. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జారీ చేసిన ఉత్తర్వులను ప్రదర్శించారు. అయితే అధికారులు ఈ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ భవనాన్ని ప్రారంభించారు. దీనిపై ఆగ్రహించిన వేణుగోపాల్‌రెడ్డి మళ్లీ ప్రెస్‌మీట్ పెట్టి ఉత్తర్వులను దిక్కరించిన అధికారులపై లోకాయుక్తలో కేసు వేస్తానని హెచ్చరించారు.

దాతల పేర్లను బోర్డులో పెట్టిస్తాం

శామీర్‌పేట సబ్ రిజిస్ట్రార్ నూతన భవన నిర్మాణానికి ఆర్థికసాయం చేసిన దాతలను ప్రారంభోత్సవానికి ఎందుకు ఆహ్వానించలేదని బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సుదర్శన్ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతును ప్రశ్నించారు. దీనికి అధికారి బదులిస్తూ త్వరలోనే దాతల పేర్లను శిలాఫలకంపై వేసి భవనానికి ఏర్పాటు చేస్తామని చెప్పడంతో వివాదం కాస్త సద్దుమనిగింది.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

కులకచర్ల/దోమ/కొడంగల్ రూరల్/బషీరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి ఆఫ్రీన్‌ఫాతీమా తెలిపారు. మండలంలోని కులకచర్ల, పుట్టపహాడ్ గ్రామాల్లో పశువులకు గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అదేవిధంగా దోమ మండలంలోని బొంపల్లి గ్రామంలో పశువులకు పశువైద్య సిబ్బంది స్వప్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అదేవిధంగా కొడంగల్ మండలంలోని రుద్రారం గ్రామంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేశారు. మండలంలోని రుద్రారం, గుండ్లకుంట, ఆలేడు గ్రామాల్లో మొత్తం 874 పశువులకు టీకాలను వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హస్నాబాద్ పశువైద్యశాల వైద్యులు ఆశోక్ రెడ్డి, వెంకటయ్య, శేఖర్, జహీర్, విశ్వనాథ్ పాల్గొన్నారు. అదేవిధంగా బషీరాబాద్ మండలంలోని కంసాన్‌పల్లి(బి) గ్రామంలో మైల్వార్ పశువైద్య ఉపకేంద్రం డాక్టర్ భీంరెడ్డి పశువులకు టీకాలు వేశారు. 180 తెల్ల పశువులు, 36 గేదేలకు టీకాలు వేసినట్లు తెలిపారు. నవంబరు 14వ తేదీ వరకూ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు


కోకట్ కాగ్నా వద్ద ఇసుక రీచ్ పాయింట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

యాలాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని డీపీవో జయసుధ హెచ్చరించారు. కోకట్ కాగ్నా వాగులో గల ఇసుక రీచ్‌పాయింట్‌ను, సంగెంఖుర్దు, బెన్నూరు, గోవిందరావుపేట, విశ్వనాథ్‌పూర్, దేవనూరు గ్రామాల పరిధిలోని ఇసుక రీచ్‌పాయింట్‌లను ఈఈఎంబీ ఇంద్రా రవికుమార్, తాహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో పుష్పలీలతో కలిసి గురువారం పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే సంబంధిత ట్రాక్టర్ డ్రైవర్, యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో యాదయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రభాకర్ పాల్గొన్నారు.

పరిశ్రమ వ్యవస్థాపకులుగా ఎదగాలి


మాట్లాడుతున్న సీఐటీడీ నిపుణురాలు సీహెచ్ కస్తూరి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భవిష్యత్తులో పరిశ్రమ వ్యవస్థాపకులుగా ఎదగాలని సీఐటీడీ నిపుణురాలు కస్తూరి అన్నారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో గురువారం స్టార్టప్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు శ్రీధర్, హెచ్‌వోడీలు హరికృష్ణ, సంతోష్, సమన్వయకర్తలు రాజేష్, అభిరాం, అపర్ణ, ప్రియ పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలించిన అధికారులు

పూడూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధి అంగడిచిట్టంపల్లి గేటు నుంచి లాల్‌పహాడ్ వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డును అసిస్టెంట్ కలెక్టర్‌హర్ష చౌదరి గురువారం పరిశీలించారు. వర్షాల వల్ల పాడైన రోడ్డును ఆయన పరిశీలించారు. రోడ్డుపై పడిన గుంతలకు మరమ్మతులు చేయించారా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డును పునరుద్ధరించాలని ఆదేశించారు.